రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు

- జిల్లాలో 26,396 మంది లబ్ధిదారులు
- కలెక్టర్ సత్య శారద

కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, జూలై 18: రుణమాఫీ అమలుకు జిల్లాలో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె వ్యవసాయ, సహకార సంఘాల అధికారులు, బ్యాంకర్లతో సమీక్షించారు. జిల్లాలో 26,396 మంది రైతులకు రూ. 134.20 కోట్ల రుణాలు మొదటి విడతలో రైతుల రుణ ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. మొదటి విడత రూ. లక్షలోపు, రెండో విడతలో రూ. 1.50 లక్షలలోపు, మూడో విడతలో రూ. 2 లక్షల వరకు దశల వారీగా రుణమాఫీ ఉంటుందన్నారు. లబ్ధిదారుల జాబితాను అన్ని ఎంపీడీవో కార్యాలయాలు, రైతు వేదికలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. జిల్లాలోని బ్యాంకులు, సహకార శాఖ బ్యాంకులు, సహకార శాఖ సొసైటీల ద్వారా రైతుల ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమ అవుతుందన్నారు. రుణమాఫీలో సమస్యలుంటే 1800425 3434, 91542529 36 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. రైతులు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. బ్యాంకర్లు, రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమీక్షలో డీఏవో ఉషాదయాళ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ హెచ్.రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ బ్యాంక్ మేనేజర్ సత్యం, వరంగల్ కోపరేటివ్ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ మాధవి పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు భారీ వర్షాలు

జిల్లాలో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తక్షణ సహాయం కోసం కలెక్టరేట్‌లో 18004253434, 9154252936 టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బల్దియాలో బదిలీల కౌన్సెలింగ్

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్, అదనపు కలెక్టర్

వరంగల్, జూలై 18: జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో గురువారం ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఎంహెచ్‌వో సాంబశివరావు, డీఆర్‌వో గణేశ్, బల్దియా అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి జూనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, అటెండర్లు, పారిశుధ్య కార్మికులకు బదిలీల కౌన్సెలింగ్ చేశారు. ఈ నెల 19 వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసి 20న బదిలీల ఉత్తర్వులు జారీ చేయనున్నారు. కాగా, తొలిసారి పారిశుధ్య కార్మికులకు బదిలీల ప్రక్రియను చేపట్టారు. నాలుగో తరగతి ఉద్యోగులైన పారిశుధ్య కార్మికులు, అటెండర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బల్దియాలో 202 మంది ఉండగా, 197 మంది కౌన్సెలింగ్‌కు అర్హులుగా ఉన్నారు. వీరిలో చాలామంది రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉండడంతో కార్మికులు బదిలీలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, హనుమకొండ ప్రాంతానికి చెందిన కార్మికురాలు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బదిలీ కార్మికుల స్కీం కింద కుటుంబ సభ్యుడిని పనిలో పెట్టారు. ఇప్పుడు అసలు ఉద్యోగి కౌన్సెలింగ్ రావాలని అధికారులు ఆదేశాలు ఇవ్వడంతో సదరు కార్మికురాలు అంబులెన్స్‌లో వచ్చి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని బదిలీ కమిటీ కన్వీనర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు.

'కళాశాలకు నూతన భవనం నిర్మించాలి'

నర్సంపేట, జూలై 18: జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ కోరారు. ఈ మేరకు గురువారం నర్సంపేటలోని ఆర్డీవో కార్యాలయంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. భవనం శిథిలావస్థకు చేరిందని, వర్షానికి కురుస్తున్నదని, పెచ్చులూడి పిల్లలపై పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్యామ్, కల్యాణ్, రవి, రంజిత్, సుశీల్, పవన్, కల్యాణి, రజిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి

కరీమాబాద్, జూలై 18: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని కార్పొరేటర్ పోశాల పద్మ అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి ఆధ్వర్యంలో గురువారం 41వ డివిజన్‌లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు.

బీరన్న ఆలయ హుండీ లెక్కింపు

కరీమాబాద్, జూలై 18: బీరన్న ఆలయ హుండీని కమిటీ సభ్యులు, కుల సంఘం నాయకులు గురువారం బీరన్నకుంటలోని ఆలయంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ. 61,753తోపాటు వెండి, బంగారం వచ్చినట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడు కోరె సదానందం, ప్రధాన కార్యదర్శి కోరె నాగరాజు, కోశాధికారి నరిగె లక్ష్మణ్ పాల్గొన్నారు.

'రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి'

నర్సంపేట, జూలై 18: అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో స్త్రీశిశు సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, కమిషనర్ కాంతివెస్లీని కలిసి వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో రమాతార, వేదవతి, ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

OLD AGE HOME
★ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

దేవేందర్‌రావుకు బీఆర్ఎస్ నేతల నివాళి

రాయపర్తి, జూలై 18: బురహాన్‌పల్లిలో ఇటీవల హత్యకు గురైన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్‌రావుకు గురువారం బీఆర్ఎస్ నాయకులు నివాళులర్పించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి, నాయకులు రంగు కుమార్, కోదాటి దయాకర్‌రావు, పూస మధు, నయీం, అక్రఫ్‌పాషా, యాదగిరిరెడ్డి, కిషన్, యాకయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడి ఆత్మహత్య

సంగెం, జూలై 18: రైలు కిందపడి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన మెట్టుపెల్లి భాస్కర్(51) కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా, ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన కొంతకాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు గురువారం ఎల్గూర్-చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

'మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు'

ఖానాపురం, జూలై 18 : యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావొద్దని దుగ్గొండి సీఐ రాజగోపాల్ అన్నారు. గురువారం బుధరావుపేట మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బారినపడితే 1930కి కాల్ చేయాలని సూచించారు. ఎస్సై రఘుపతి, ప్రిన్సిపాల్ సధాకర్‌రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

- దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి
- లోపాలను ఎవరూ ఎత్తిచూపొద్దు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్యశారద

కాశీబుగ్గ, జూలై 18: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని పత్తి యార్డులో జిల్లా సంక్షేమ శాఖ, అలిమ్కో సంయుక్తంగా ఏడీఐపీ పథకం కింద గురువారం వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన 102 మంది దివ్యాంగులకు రూ. 42 లక్షల విలువైన 102 బ్యాటరీ ట్రై సైకిళ్లు, రూ. 2.70 లక్షల విలువైన ఆరు ల్యాప్‌టాప్‌లు, ఐఐటీలో సీటు సాధించిన దివ్యాంగురాలికి పుల్లీ ఆటోమేటెడ్ త్రిచక్ర వాహనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో కలిసి లబ్ధిదారులకు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఎక్కడా దివ్యాంగులమనే భావన ఉండొద్దన్నారు. వీరిని ఎవరూ చిన్నచూపు చూడొద్దని, సమాజంలో అందరితో పాటు వీరి అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొంతమంది పుట్టుకతో, జన్యు లోపం వల్ల దివ్యాంగులుగా మారుతున్నారని, దీన్ని ఛాలెంజ్‌గా తీసుకొని ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. దివ్యాంగురాలు రాపర్తి సుప్రీత ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తూర్పాటి సులోచనా సారయ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, ఆలింకో అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్ రూం పరిశీలన

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని గోదాముల్లో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల స్ట్రాంగ్ రూంల వద్ద లాగ్‌బుక్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, వాచ్‌రూమ్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎలక్షన్ పిటిషన్ పీరియడ్ పూర్తయ్యే వరకూ భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కాల వ్యవధి పూర్తయిన తర్వాత వర్ధన్నపేట, వరంగల్‌తూర్పు, నర్సంపేట నియోజకవర్గాలకు ఈవీఎంలను వేర్‌హౌస్‌కు తరలించి భద్రపరుస్తామని ఆమె అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి పాలకుర్తి ప్రసాద్‌రావు, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు సందర్శన

ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని అపరాల యార్డును కలెక్టర్ డాక్టర్ సత్యశారద సందర్శించారు. పల్లికాయ రైతులతో మాట్లాడి వారి సమస్యలను, క్రయవిక్రయాలు, ధరను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

'రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు అవకాశం కల్పించాలి'

గిర్మాజీపేట, జూలై 18: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ నియామకానికి ఎన్నికలు అనివార్యమైతే ఉత్తర తెలంగాణ నుంచి జిల్లాకు అవకాశం కల్పించాలని కార్యదర్శి అశోక్‌కుమార్ కోరారు. ఆరు జిల్లాల ఆర్యవైశ్య సంఘం సభ్యులు గురువారం వరంగల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా జిల్లా నుంచి సేవలందిస్తున్న వంగేటి అశోక్‌కుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకొని తమ ఐక్యతను చాటాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొద్దుటూరి గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శి ప్రతాపని పాండురంగయ్య, కార్యవర్గ సభ్యులు వీరన్న, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, ఉమ్మడి జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

'కోఆపరేటీవ్ సొసైటీ ఏర్పాటు చేయాలి'

నల్లబెల్లి/సంగెం, జూలై 18 : ముదిరాజ్ కులస్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కో ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ ఏర్పాటు చేయాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో గురువారం ముదిరాజ్‌లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోనెల పద్మ, డివిజన్ నాయకుడు జినుకల కొమ్మాలు, మండల అధ్యక్షుడు దామ సాంబయ్య, నాయకులు పాండవుల రాంబాబు, సంతోష్, రేణు, నాగరాజు, భిక్షపతి పాల్గొన్నారు.

అలాగే, ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గురువారం సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

నర్సంపేట, జూలై 18: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. గురువారం సాయంత్రం ఆమె నర్సంపేట పట్టణంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 2018 నుంచి గత నవంబర్‌లోపు తీసుకున్న రూ. 2 లక్షలలోపు రుణాలన్నీ విడుతల వారీగా మాఫీ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో, తహసీల్దార్, ఏఈవో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కరీమాబాద్, జూలై 18: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బుధవారం రాత్రి 11గంటలకు జఫర్‌గఢ్ మండలం సూరారం గ్రామానికి చెందిన ముంజ వినయ్(24) హనుమకొండ నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో బొల్లికుంట సమీపంలో లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమ వెంచర్ హద్దురాళ్ల తొలగింపు

గీసుగొండ, జూలై 18: వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్ల రెవెన్యూ పరిధిలోని 178, 179 సర్వే నంబర్లలో మూడు ఎకరాల్లో కుడా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్ల హద్దురాళ్లు, రోడ్డును జేసీబీతో గురువారం తొలగించినట్లు మున్సిపల్ ఏసీపీ ఖలీల్ తెలిపారు. అనుమతి ఉన్న వెంచర్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

ఖాళీ బిందెలతో నిరసనలు తెలుపుతున్న స్థానికులు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

కాశీబుగ్గ, జూలై 18: వరంగల్ 20వ డివిజన్ ప్రతాపరుద్ర వీధికి చెందిన మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తమ కాలనీకి 20 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీలో ఫ్లెక్సీ రగడ

చెన్నారావుపేట, జూలై 18: మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఫ్లెక్సీ రగడ తలెత్తినట్లు తెలిసింది. గురువారం పంట రుణమాఫీ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చెన్నారావుపేట రైతు వేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందులో తమ ఫొటోలు ముద్రించలేదని కొందరు, తమ ఫొటోలను కింది వరుసలో పెట్టారని మరికొందరు ఆగ్రహంతో ఫ్లెక్సీని తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో సీనియర్ నాయకులు వారిని అడ్డుకున్నట్లు తెలిసింది.

వర్ధన్నపేట: రైతు వేదికలో సీఎం ప్రసంగం వింటున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, కలెక్టర్

రుణమాఫీతో రైతులకు ఆర్థిక భరోసా

ఎమ్మెల్యేలు నాగరాజు, దొంతి

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్: రుణమాఫీతో సన్న చిన్నకారు రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని వర్ధన్నపేట, నర్సంపేట ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, దొంతి మాధవరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం రూ. లక్షలోపు పంట రుణమాఫీ చేసిన సందర్భంగా వర్ధన్నపేట, చెన్నారావుపేటలోని రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. వర్ధన్నపేట రైతు వేదికలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కలెక్టర్ సత్యశారదతో కలిసి నాగరాజు మాట్లాడారు. ఆగస్టు 15లోగా పూర్తిస్థాయిలో పంట రుణాలు మాఫీ అవుతాయని చెప్పారు. దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో 18,462 మంది రైతులకు రుణమాఫీ అవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేడీఏ ఉషాదయాళ్, ఏడీఏ సురేశ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, పర్వతగిరిలో ఎమ్మెల్యే నాగరాజు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కాగా, రుణమాఫీ సందర్భంగా నర్సంపేట, గీసుగొండ, ఖానాపురం, రాయపర్తి, పర్వతగిరి, సంగెం, నల్లబెల్లి, నెక్కొండ మండలాల తోపాటు వరంగల్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి, ఆరెపల్లి, కొత్తపేట, 14వ డివిజన్ లోని ఎనుమాముల, రెడ్డిపాలెంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వరంగల్ మండలంలో 1110 మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

గుంతల రోడ్లతో ఇబ్బందులు

కరీమాబాద్: ఎస్ఆర్ఆర్‌తోటలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కరీమాబాద్/చెన్నారావుపేట, జూలై 18: అసలే వర్షాకాలం.. ఆపై రోడ్లపై అడుగడుగు నా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వరంగల్ ఎస్ఆర్ ఆర్‌తోటలోని ఓడీసీఎంఎస్ భవనం ఎదుట నుంచి కాలనీకి వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో గుంతల్లో వర్షపునీరు నిలుస్తున్నది. గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. అలాగే, చెన్నారావుపేట మండలం పాపయ్యపేట నుంచి ఎల్లాయగూడెం వెళ్లే దారిలోని బీసీకాలనీ రోడ్డు బురదమయంగా మారిందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని దళితరత్న వడ్డూరి కుమారస్వామి వాపోయారు. వర్షం వస్తే ప్రయాణం నరకప్రాయంగా మారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

చెన్నారావుపేట: బురదమయంగా మారిన రహదారి

ఖాళీ ప్లాట్లతో కష్టాలు

- నివాస ప్రాంతాల్లో నిలుస్తున్న మురుగునీరు
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

ఎస్ఆర్ఆర్‌తోటలో ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు, పెరిగిన పిచ్చిమొక్కలు

కరీమాబాద్, జూలై 18: వరంగల్ అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని ఖాళీ ప్లాట్ల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. యజమానులు స్థలాలను కొనుగోలు చేసి వదిలేయడంతో మురుగునీరు నిలిచి పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామునూరు, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఏకశిలానగర్‌లో చాలా వరకు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. గతంలో అండర్ రైల్వేగేట్ ప్రాంతంలో కుంటలు, పొలాలు, మిల్లులు తదితర భూములు ఎక్కువగా ఉండేవి. జనాభా పెరగడంతో గృహ నిర్మాణాలు సైతం పెరిగాయి. ప్రతి కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ జాగాలు ఉన్నాయి. ప్లాట్లు ఉన్నచోట రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరగలేదు. ఇళ్ల నిర్మాణాలు ఎత్తుగా ఉండి ఖాళీ స్థలాలు లోతట్టుగా ఉండడంతో మురుగునీరు మొత్తం ఖాళీ ప్లాట్లలోకి చేరి నెలల తరబడి నిలుస్తున్నది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దుర్వాసన వెదజల్లుతున్నదని ఫలితంగా అనారోగ్యాల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు సమాచారం ఇచ్చి నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, జూలై 18: సూర్యతండాలో గిరిజనులు గురువారం తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచు వాంకుడోతు రజిత, మాజీ ఎంపీటీసీ గోపాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చెన్నారావుపేట: వైద్య శిబిరంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

చెన్నారావుపేట/వర్ధన్నపేట/నల్లబెల్లి, జూలై 18: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. చెన్నారావుపేట మండలంలోని జోజిపేటలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలను చైతన్యం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సరోజ, సిబ్బంది రామెల్, సువార్త, వెంకట్‌రెడ్డి, సురేందర్, లింగమూర్తి పాల్గొన్నారు. అలాగే, వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ స్వర్ణకుమారితో కలిసి మెడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ డాక్టర్ బి.మౌనిక పేదలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం డి.మంజుల, ఆశ వర్కర్లు కల్యాణి, రమ, మంగ మ్మ, అనిత, స్రవంతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. అంతేకాకుండా నల్లబెల్లి మండలంలోని రేలకుంట, లెంకాలపల్లి, బోల్లోనిపల్లెలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మహంతి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రుతి, సాంబమూర్తి, కవిత, రజిత, నిఖిల్, హెబిసిబా, రజునా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిని వివరిస్తున్న కూసం రాజమౌళి

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీ బృందం

గీసుగొండ, జూలై 18: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని గురువారం ఇటలీలోని క్యాథలిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇటలీ, లితిజ, సిసిలియా, అనమ్యుల్, ఏరిత్రియా దేశాలకు చెందిన ప్రతినిధులు సందర్శించారు. గ్రామీణ అభివృద్ధిపై స్టడీ టూర్‌లో భాగంగా బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో ప